# పెన్సిల్వేనియాలో సంక్రాంతి వేడుకలు

## అమెరికా ప్రవాసాంధ్రుల సంబరం




మాతృభూమికి వేలాదిమైళ్ల దూరంలో ఉన్నా.. సంక్రాంతి సంబరాలను వేడుకగా జరుపుకోవటం ద్వారా ప్రవాసాంధ్రులు సొంతగడ్డపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. అమెరికాలోని తెలుగువారు వారాంతపు సెలవు దినాలైన శని, ఆదివారాల్లో పండుగలను జరపటం ఆనవాయితీగా వస్తోంది. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని 'గ్రేటర్ డెన్వర్ వ్యాలీ'లో అక్కడి తెలుగుసంఘం ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. దాదాపు మూడు వందలకు పైగా తెలుగు కుటుంబాలు ఇందులో పాలుపంచుకున్నాయి. అక్కడి హిందూదేవాలయం ఆవరణలో పిల్లలకు భోగిపళ్లుపోసి సంబరాలను ఆరంభించారు. మహిళలకు ముగ్గుల పోటీలు.. బాలబాలికలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ వేడుకలు అక్కడి తెలుగు వారికి సొంతరాష్ట్రంలో సంక్రాంతి సంబరాలను జరుపుకున్నంత ఆనందాన్ని కలిగించాయి.



### అలరించిన నృత్యాలు

సంక్రాంతి వేడుకల సందర్భంగా ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. నృత్య మాధవి స్కూలుకు చెందిన చాపరాల స్నేహ, మేడిచర్ల శైలజ, స్వర్ణరచన ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసింది. కామిరెడ్డి రేఖ, లక్ష్మి శ్రీనివాస్, తోటఅక్షిత, నిధిలు ప్రదర్శించిన శివ పాదం అనే నృత్యకార్యక్రమంతోపాటు ప్రదర్శించిన జానపద నాట్యం సంబరాలకు వన్నె తెచ్చాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. తెలుగు రుచులతో కూడిన పసందైన విందుభోజ నాన్ని నిర్వాహకులు ఏర్పాటుచేశారు. సరోజాసాగర్, బుద్దవరపు మల్లిక్, అట్లూరి శైలజ, కనిమెళ్లశాంతి, దండు పట్లసంధ్య తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

